RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 05 -01 - 2024
సంపుటి: 1 | సంచిక : 231 | పేజీలు : 4 | వెల : 5/-




## వైఎస్సార్టీపీ 'హస్త'మయం!

- అయ్య పార్టీలోకి రాజన్న బిడ్డ
- కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిల

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసారు.

4లో

# ఇక సోనియా మూడ్!



- తెలంగాణలో పోటీకి టీపీసీసీ వ్యూహం
- మూడు స్థానాలు ఎంపిక చేసిన స్టేట్ పార్టీ
- పరిశీలనలో మెదక్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల
- సోనియా కోసం రాష్ట్ర నాయకత్వం రిజర్వ్

న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :
టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా సోనియాగాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయించాలని టీపీసీసీ తీర్మానం చేసింది. గతంలో ఇందిరాగాంధీ మాదిరిగా ఈసారి సోనియా గాంధీని కూడా దక్షిణాది నుంచి పోటీ చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ నుంచి సోనియాగాంధీ ఎంపీగా పోటీ చేస్తే ఆ ఇంపాక్ట్‌తో రాష్ట్రంలో మరిన్ని ఎంపీ సీట్లు గెలవొచ్చని కాంగ్రెస్ నేతలు ఆశిస్తున్నారు. సోనియా ఎఫెక్ట్ ఒక్క తెలంగాణలోనే కాదు మెం-త్తం దక్షిణాది రాష్ట్రాలపైనా ఉ ంటుందంటున్నారు. అందుకోసం.. నాలుగు నియోజకవర్గాలను పరిశీలిస్తున్నారు తెలంగాణ కాంగ్రెస్ నేతలు. దీంతో సోనియా ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. సోనియాగాంధీ తెలంగాణలో పోటీ చేస్తే.. ఫస్ట్ ఆప్షన్ మల్కాజిగిరి ఉండే చాన్స్ లేకపోలేదు. మల్కాజ్‌గిరి ఇప్పటికే కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం.. 2019 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇక్కడ నుంచి గెలిచారు. ఓవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అధికారంలో ఉండడం.. మరోవైపు రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడంతో ఇక్కడ సోనియా గెలుపునకు సునాయాసమని చెబుతున్నారు. దీనికి తోడు మల్కాజ్‌గిరి మిని ఇండియా కావడంతో సోనియా ఇక్కడ నుంచి పోటీ చేయాలని సూచిస్తుంది టీపీసీసీ. ఇక రెండో ఆప్షన్ మెదక్ నియోజకవర్గం. గతంలో ఇక్కడి నుంచే ఇందిరా గాంధీ పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు సోనియాని మెదక్ నుంచి బరిలో దింపితే ఈజీగా గెలుస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మెదక్‌లో ప్రచారం చేయకపోయినా.. ఇందిరాగాంధీ గెలిచారు. ఇందిరను ఓడించడమే లక్ష్యంగా పది మంది హేమాహేమీలు బరిలో దిగారు. అయినా మెదక్ ప్రజలు ఇందిరకు బ్రహ్మరథం పట్టారు. ఏకంగా 2 లక్షల పైచిలుకు మెజార్టీని కట్టబెట్టారు. అంతేకాదు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకంగా 41 ఎంపీ స్థానాలు

మిగతా 2వ పేజీలో...

# హైవేలో ఆగిన కారు!



- జాతీయ పార్టీ ఆశలు గల్లంతు
- మహారాష్ట్ర ఊసెత్తని బీఆర్ఎస్ బాస్
- బంగారు తునక తునాతనకలు
- జాతీయ పార్టీ ఆశలు గల్లంతు
- ఎంపీ ఎన్నికల్లో గెలుపే జీవం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టాలి.. తర్వాత వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ, మహారాష్ట్రలో కలిపి కనీసం 50 ఎంపీ సీట్లు గెలవాలి.. తర్వాత కేంద్రంలో చక్రం తిప్పాలి.. వీలైతే ప్రధాని పీఠం అధిష్టించాలి.. ఇదీ ఏడాది క్రితం వరకు భారత రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆలోచన. తాను ప్రధాని అయితే.. రాష్ట్రంలో యువరాజు కేటీఆర్‌ను సీఎం అవుతాడు అని కలలు కన్నాడు. కానీ.. నోరు ఒకటి తలిస్తే.. నొసలు ఇంకోటి తలుస్తుందట తలుస్తుంది అన్నట్లు.. కేసీఆర్ కలలు పటాపంచలయ్యాయి. గాలి మేడలు నేల కూలాయి.. గడీలు బద్ధలయ్యాయి. దీంతో ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల ఊసే ఎత్తడం లేదు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేసీఆర్.. మహారాష్ట్ర రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 400 కార్ల కాన్వాయ్‌తో మహారాష్ట్రకు వెళ్లారు. ఐదారు సభలు నిర్వహించారు. తెలంగాణ బంగారు తెలంగాణ అయింది.. మహా-రాష్ట్రను కూడా బంగారు మహారాష్ట్ర చేస్తానని హామీలు ఇచ్చారు. పింఛన్లు పెంచుతామన్నారు. ఇంకా ఎన్నో హామీలు ఇచ్చారు. మహారాష్ట్ర కోసం ఓ ప్రత్యేక ప్రణాళికే రూపొందించుకున్నారు గులాబీ బాస్. వివిధ పార్టీల నేతలను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని చేర్చుకున్నారు. ఇక పార్టీ కార్యకలాపాల కోసం మహారాష్ట్ర ఇన్‌చార్జిగా తన బంధువును నియమించారు. వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు

మిగతా 2వ పేజీలో...

## 'కారు'లో ఇం'ధనం' ఫుల్

- కలెక్షన్లలో బీఆర్ఎస్ టాప్
- 10 కోట్లు చొప్పున ఇచ్చిన నేతలు
- గత ఏడాది రూ.683కోట్ల విరాళాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
రాజకీయ పార్టీలకు ప్రతీ ఏటా వివిధ రకాలుగా సమకూరే ఆదాయానికి సంబంధించి ప్రాంతీయ పార్టీల విభాగంలో బీఆర్ఎస్ మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవలే అధికారం కోల్పోయిన ఆ పార్టీకి 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.683 కోట్ల

మిగతా 2వ పేజీలో...

## అబ్బ ఒక్కటి..!

- పార్లమెంట్ సీటు కోసం ఎర్రజెండాల పాకులాట
- ఒక్క టికెట్ కావాలంటూ కాంగ్రెస్‌కు విజ్ఞప్తులు
- సీనియర్ నేతలతో సీపీఐ ముమ్మర ప్రయత్నాలు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానంతోనే సంతృప్తి
- అధిష్టానం నిర్ణయంపైనే సీపీఐకి సీటుకు ఛాన్స్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నయా సర్కార్ పాలన పట్టాలెక్కింది. దీంతో ప్రధాన పార్టీలన్నీ ఇక పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్ పెట్టాయి. మెయిన్ పార్టీలతో కలిసి వెళ్లేందుకు చిన్న పార్టీలు సైతం పావులు కదుపుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి వెళ్లిన కామ్రేడ్లు, లోక్‌సభ బరిలోనూ అదే అవగాహనతో వెళ్లాలని ప్లాన్ చేస్తున్నాయి. ఒక్క ఎంపీ

మిగతా 3వ పేజీలో...




## రెండు ఎమ్మెల్సీలకు నోటిఫికేషన్లు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
తెలంగాణ రాష్ట్రంలో రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. జనవరి 29న ఆ రెండు స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీలుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు కడియం శ్రీహరి,

మిగతా 4వ పేజీలో...

## పోలీస్.. మాలిష్!

- సివిల్ కేసుల్లో తలదూర్చిన వారిపై సర్కారు సీరియస్
- ఇప్పటికే పలువురు ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు
- పోలీసులపై 480 ఫిర్యాదులున్నట్లు సమాచారం



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
సివిల్ వివాదాలు, కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తలదూర్చితే సీరియస్ పరిణామాలుంటాయని ఎస్సై, సీఐలను హెచ్చరిస్తున్నారు ఉన్నతాధికారులు. ఎలాంటి ఆరోపణలు వచ్చినా తక్షణ చర్యలు ఉంటాయంటున్నారు. అంతేకాదు డిపార్ట్‌మెంట్‌లో ఇంటర్నల్ ఇన్వెస్టిగేషన్ చేయిస్తున్నారు. గతంలో ఎలా ఉన్నా, ఇప్పుడు మాత్రం పద్ధతి మార్చుకోవాలని వార్నింగ్ ఇస్తున్నారు. పలు వివాదాల్లో తలదూర్చిన ఇన్‌స్పెక్టర్లను ఇప్పటికే సస్పెండ్ చేసిన పోలీస్ బాసులు.. మరికొందరిపైనా ఇన్వెస్టిగేషన్ చేయిస్తున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ అంటేనే అవినీతి ఎక్కువగా ఉంటుందని, డబ్బులిస్తే నిందితులకు కూడా సహకరిస్తారని అపవాదు ఉంది. అంతేకాదు పొలిటికల్ లీడర్లకు తొత్తులుగా వ్యవహరిస్తారనే మచ్చ ఉంది. దానికి తగ్గట్టుగానే

మిగతా 3వ పేజీలో...

# ఆరింటి ఖజానా వేరే!

- గ్యారంటీల కోసం స్పెషల్ బడ్జెట్
- హామీల అమలుపై సర్కారు కసరత్తు
- పథకాల లబ్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- నిధులు పోగేసే పనిలో ప్రభుత్వం



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీలను విజయవంతంగా అమలుచేసేందుకు వీలుగా 2024-25వ ఏడాదికి బడ్జెట్‌ను రూపకల్పన చేసేందుకు వీలుగా అధికారులు కసరత్తులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలు తీర్చే విధంగా వాస్తవికతతో కూడిన బడ్జెట్‌ను రూపొందించే పనిలో అధికారులు బిజీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజులకే పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారని, సిఎం హామీలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాల్సి ఉందని, పైగా ఈ ఏడాదిలోనే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేసే బృహత్తర కార్యక్రమం ముందున్నందున, బడ్జెట్ రూపకల్పనలో ఎన్నో ఛాలెంజెలను దృష్టిలో పెట్టుకొని కసరత్తులు చేస్తున్నామని వివరించారు. ఒకవైపున కేంద్ర ప్రభుత్వం రానున్న ఆర్థిక సంవత్సరానికి ఓట్ ఆన్ ఎక్కౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతోందని, అయితే కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలా ఉండబోతున్నాయి, తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎన్ని వస్తాయి?, ఆ పథకాలకు బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయనే అంశాలపై ఒక క్లారిటీ కూడా రావాల్సి ఉందని ఆర్థికశాఖలోని కొందరు సీనియర్ అధికారులు వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ ఎక్కౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడితే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దగా నిధులను కేటాయింపులు చేయకుండా కేవలం ప్రభుత్వ ఖర్చులకు, పాలనాపరమైన అవసరాలకు మాత్రమే నిధులను కేటాయించి కేంద్రం చేతులు దులుపుకునే అవకాశాలు కూడా ఉన్నాయని, మరలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కోసం ఆశలు పెట్టుకోవడం వృధా ప్రయాసే అవుతుందని మరికొందరు అధికారులంటున్నారు. అయినప్పటికీ అన్ని ప్రభుత్వ శాఖలకు మాత్రం 2024-25వ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధులపై ప్రతిపాదనలు ఇవ్వాలని

మిగతా 3వ పేజీలో...

## పో(టీ)టుగాళ్ల కోసం వేట

- బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ
- లోక్‌సభ ఎన్నికలకు మొదలైన సర్వేలు
- ఆర్థిక, అంగబలం ఉన్నవారి వెతుకులాట



నల్లగొండ, ప్రభాతసూర్యుడు :
తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ రాజకీయ వేడి మొదలైంది. నిన్న మొన్నటి దాక అసెంబ్లీ ఎన్నికల సందడి నెలకొనగా, తిరిగి పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి రాజుకుంది. ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల వేటలో తలమునకలయ్యాయి. కేంద్రంలో మూడోసారి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్న భారతీ-య జనతా పార్టీ.. నల్లగొండ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ముచ్చటగా మూడోసారి కూడా అధికారంలోకి రావడానికి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కేంద్రంలోని కమలదళం ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా నల్గొండ పార్లమెంటు స్థానంపై దృష్టి సారించిన బీజేపీ, ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్‌ను రంగంలోకి దింపింది. ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న లక్ష్మణ్, కార్యకర్తలను రానున్న పార్లమెంటు ఎన్నికలకు సంసిద్ధం చేస్తున్నారు. నల్గొండ పార్లమెంటుకు పోటీ చేయడానికి భారతీయ జనతా పార్టీలో డిమాండ్ ఎక్కువగానే ఉంది. చాల మంది ఆశావాహులు పోటీ పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్లు బలమైన అభ్యర్థి అవుతారని ఆశించారు. అయితే ఆర్థికంగా భారం మోయలేనిదంటూ ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. ఇక సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ కూడా బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి

మిగతా 3వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అంధులకోసం బస్సులో సౌండ్ వాయిస్ సిస్టం



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఆర్టీసీ బస్సుల్లో అంధుల కోసం సౌండ్ వాయిస్ సిస్టం ఏర్పాటు చేయనున్నామని మంత్రి సితక్క తెలిపారుఅంధుల ఆరాధ్య దైవం, బ్రెయిలి లిపి సృష్టికర్త డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి మలక్పేట లోని దివ్యంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సీతక్క అన్నారు. దివ్యాంగుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి మ్యానిఫెస్టోలో రూపొందించిన విధంగా ఉపాధి.ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రోబోయో నోటిఫికేషన్ లలో దివ్యంగుల కోటా పెంచే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అంధులకు లాప్ టాప్ లు, ఫోన్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

## 39స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి హబ్సి గూడలో జాన్సన్ గ్రామర్ స్కూల్ బస్సు టైర్ కిందపడి జెవాలానా (2) అనే చిన్నారి దుర్మరణం పాలయింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేరళకు చెందిన మిథున్ హబ్సిగుడాలోని స్ట్రీట్ నెంబర్ 8 నివాసం ఉంటున్నారు. పెద్దబ్బాయి జాన్సన్ గ్రామర్ స్కూల్లో 1 వ తరగతి చదువుతు న్నాడు. కాగా జెవలానా తల్లిదండ్రులు తమ పెద్ద అబ్బాయిని బస్సు ఎక్కించే క్రమంలో ఉ ండగా, చిన్నమ్మాయి స్కిడ్ అయ్యి బస్సు కింద పడిపోయింది. అది గమనించని బస్సు డ్రైవర్ వెంటనే బస్సును వెనక్కి జరపడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాంతో సమాచారం అందుకున్న ఓయూ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, సంఘటనకు కారణమైన బస్సు డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు.

## పెళ్లింట విషాదం

**చెరువులో మునిగి పెళ్లికూతురు అన్న మృతి**



**మెదక్, ప్రభాతసూర్యుడు :** మెదక్ జిల్లా తూ్ర-పాన్ మున్సిపాలిటీ పరిధి రావెల్లి గ్రామంలో పెళ్లి శు భకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. తూప్రాన్ మున్సిపాలిటీ పెద్ద చెరువులో తన తోటి స్నేహితులతో కలిసి సరదాగా స్నానానికి వెల్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి లోని రావెల్లి గ్రామానికి చెందిన చాకలి తంగేళ్ల లక్ష్మణ్ (22) తన చెల్లెలు పెళ్లి రెండు రోజుల్లో ఉన్నదని తెలుసుకొని హైదరాబాద్ వైన్ షాప్ లో పనిచేస్తున్న ఇతను స్వగ్రామానికి వచ్చాడు అనంతరం తన తోటి మిత్రులతో కలిసి తూప్రాన్ మున్సిపాలిటీ పెద్ద చెరువులో సరదాగా స్నానానికి అని వెళ్లి గల్లంతయ్యాడు విషయం తెలుసుకున్న కుటుంబీకులు బంధువులు చెరువు వద్దకు వచ్చి బోరున విలపిస్తున్నారు. శుభకార్యం జరగాల్సిన ఇంట్లో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకోవడంతో కుటుంబీకులు బంధువులు గ్రామస్తులు బోరుణ వినిపిస్తున్నారు. నీటిలో గల్లంతైన లక్ష్మణ్ తన తోటి స్నేహితులతో కలిసి మద్యం సేవించి చెరువులో దిగినట్లు తన మిత్రులు చెబుతున్నారు. తూప్రాన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



# గ్యారంటీ పథకాలు ప్రభుత్వం అమలు

**మంచాల జెడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి**

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండలం పరిధిలోని జాపాల, రంగా పూర్ , గ్రామాలలో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలనలో భాగంగా గురువారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మర్రి నిత్య నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జాపాల, రంగాపూర్ గ్రామలలో కాం గ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ లను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఏర్పా టు అయిన నెల రోజులకే ప్రారంభిం చింది. ఆరు గ్యారెంటీలకు సంబంధిం చిన దరఖాస్తు ఫారాలను అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో, ప్రసాద్ రావు, సర్పంచ్ నహీదా బేగం రాహుఫ్, ఎంపీటీసీ లట్టుపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ మల్లప్ప, వార్డు మెంబర్ యట బిక్షపతి, రంగాపూర్ సర్పంచ్ డబ్బికార్ మమత అజయ్ బాస్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సోప్పరి దశరథ ముదిరాజ్, ఆవుల మల్లేష్, చేతాల్ల సంజీవ, ఓరుగంటి లింగమయ్య గౌడ్, ఓరుగంటి మహేష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, సుమన్,ప్రశాంత్,నాగేష్ , ఎంపిటిసి నర్సింగ్ అనిత వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ జంగారెడ్డి,వార్డు నెంబర్ మనిత వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవ రెడ్డి,ఇటికల పాశగోవర్ధన్ రెడ్డి,కోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లయన్ క్లబ్ కె.వి.రమేష్ రాజు జన్మదిన వేడుకలు

- **వేడుకల్లో పాల్గొన్న పలువురు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు**
- **లతీఫ్ సాహెబ్ దర్గా వద్ద అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ**



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి లతీఫ్ సాహెబ్ దర్గా ఆవరణలో ఇబ్ర హీంపట్టణానికి చెందిన దర్గా కమిటీ చైర్మన్ లయన్ కె.వి రాజు జన్మదిన వేడుకలు, నూతన సంవత్సర వేడు కలు బుధవారం ఘనంగా జరుపుకు న్నారు.ఈ కార్యక్రమానికి దర్గా ము త్తవల్లి చాంద్ పాషా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన చేతులమీదుగా గ్రామంలోని వృద్దులకు 160 మందికి చీరలు, 60 మందికి దోవతులు పంపిణీ చేసారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు లక్షాముప్పై వేల రూపాయలు వెచ్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్ షరీఫ్ దర్గా కమిటీ రమేష్ రెడ్డి, కృష్ణ గౌడ్, సయ్యద్ పాషా, యూసఫ్ పాషా,షరీఫ్ పాషా, కృష్ణ, రాందాస్, తిరుపతి రావు, నాగేశ్వర్ రావు, శేఖర్ గార్లు పీకే మల్లేపల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సెక్యూరిటీ గార్డుల దాడిలో యువకుడు మృతి

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** సైట్లో మద్యం సేవిస్తున్నారన్న కోపంతో అదే సైట్లో పనిచేస్తున్న యు-వకుడిపై సెక్యూరిటీ గార్డులు విచక్షణా రహితంగా కొట్టి చంపిన ఘటన బంజారాహిల్స్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం? బీహార్కు చెందిన పంకజ్ కుమార్ (32) అనే యువకుడు నెలరోజుల క్రితం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నం. 14లో నిర్మాణంలో ఉన్న రాఘవేంద్ర కన్స్ట్రక్షన్స్ సంస్థ సైట్లో పనిచేస్తున్నాడు. అదే సైట్లో పనిచేస్తున్న అన్న కొడుకు రాజేశ్ పాశ్వాన్ తో పాటు మరి కొంతమంది స్నేహితులతో కలిసి న్యూ ఇయర్ సందర్భంగా ఈనెల 1న సాయంత్రం సైట్లోని తమ షెడ్లో మద్యం సేవిస్తున్నారు. కాసేపటికి అక్కడకు వచ్చిన సెక్యూరిటీ గార్డులు ఆనంద్కుమార్ రాయ్, సంజిత్ తివారీ మద్యం సేవిస్తున్న వారిని దుర్భాషలాడటంతో గొడవ అయింది. ఈ క్రమంలో ఆనంద్కుమార్ రాయ్, సంజిత్ తివారీ తదితరులు కర్రలతో పంకజ్ కుమార్పై విచక్షణా రహితంగా కర్రలతో దాడి చేశారు. అక్కడున్న వారు అడ్డుకునేందుకు యత్నించినా వినకుండా కొట్టి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా రాత్రంతా తీవ్ర ఇబ్బంది పడిన పంకజ్ కుమార్ మరుసటిరోజు ఉదయం మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన రాజేశ్ పాశ్వాన్ తదితరులు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన బయటకు పొక్కకుండా నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించడంతో కేసు పెట్టేందుకు బాధితులు ముందుకు రాలేదు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఈ వ్యవహారంపై పోలీసులు సమాచారం అందుకొని నిందితులపై హత్య కేసు నమోదు చేయడంతో పాటు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.

## అత్తను చంపి..భార్య గొంతు కోసి?




**సంగారెడ్డి, ప్రభాతసూర్యుడు :** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం ఇస్నా పూర్ పద్మారావు కాలనీ లో ఇంట్లో శాంతమ్మ (40) అనే మహిళ హత్యకు గురయింది. రుద్రారం కు చెందిన సాయిబాబా (26)తన భార్య సత్యవతి (22) ని అత్త సంసారానికి రాకుండా అడ్డుపడుతుందనే కోపం తో అత్తను కత్తి తో పొడిచి హత్య చేసాడు. అడ్డు వచ్చిన భార్య గొంతు కోసి పరారైయాడు. తరువాత నిందితుడు పటాన్ చేరు పోలీస్ స్టేషన్ కు వచ్చి లొంగిపోయాడు. భార్య గొంతు కోయడంతో అపస్మారక స్థితి లోకి వెళ్లిన సత్యవతి నీ చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

# ఇక సోనియా మూడ్!

మొదటిపేజీ తరువాయి..

గెలిచింది కాంగ్రెస్ పార్టీ. మెదక్ నుంచి తిరిగి సోనియా గాంధీని నిలబెట్టి.. తెలంగాణలో మెజారిటీ స్థానాలు గెలవాలనుకుంటోంది కాంగ్రెస్. ఇవి రెండు కాకపోతే కరీంనగర్ను చూపిస్తోంది రాష్ట్ర కాంగ్రెస్. తెలంగాణ ఏర్పాటుకు కరీంనగర్కు సెంటిమెంట్ను తెరపైకి తెస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుపై మొదటిసారి సోనియా కరీంనగర్ నుంచే మాట్లాడారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్కు, తెలంగాణ ఇచ్చిన లీడర్గా సోనియాగాంధీకి పేరుంది కనుక కరీంనగర్ నుంచి పోటీ చేసినా సోనియా గాంధీ ఈజీగా విన్ అవుతారని చెబుతున్నాయి పార్టీ శ్రేణులు. దక్షిణ తెలంగాణపై మరింత పట్టు సాధించాలంటే అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఎంట్రీతోనే సాధ్యమవుతుందని చెబుతున్నారు. అందుకే, కరీంనగర్ కూడా రాష్ట్ర నాయకత్వం జాబితాలో ఉంది.సోనియా గాంధీ కోసం పరిశీలనలో ఉన్న మరో నియోజకవర్గం చేవెళ్ల. ఈ లోక్సభ నియోజకవర్గంలో కాంగ్రెస్కు బలం, బలగం మెండుగా ఉంది. దీంట్లో హైదరాబాద్లోని అసెంబ్లీ సెగ్మెంట్లు కూడా ఉండడం.. పైగా చేవెళ్ల ప్రాంతం కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్. సోనియా గాంధీ గనక చేవెళ్ల నుంచి పోటీ చేస్తే.. మళ్లీ సెంటిమెంట్ పునరావృతం అవుతుందని చెబుతున్నారు. పైగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్గా సీఎం రేవంత్రెడ్డి ఉన్నారు. బహుశా.. సోనియా గాంధీని చేవెళ్ల బరిలో దించే ఉద్దేశంతోనే ముందుగా ఈ నియోజకవర్గ బాధ్యతను సీఎం రేవంత్కు అప్పగించారనే టాక్ నడుస్తోంది. సోనియా గాంధీ గనక తెలంగాణ నుంచి పోటీ చేస్తే.. ఆ నియోజవకవర్గాల లిస్టులో చేవెళ్లను కూడా చేర్చి చెబుతున్నారు. అయితే టీపీసీసీ తీర్మానాన్ని ఇశాళ ఢిల్లీ వెళ్తున్న సీఎం రేవంత్ ఏఐసీసీ ముందు ఉంచనున్నారు. ఏఐసీసీ గనుక ఓకే చెబితే మాత్రం సోనియా పోటీకి రంగం సిద్ధం చేయనుంది తెలంగాణ కాంగ్రెస్.



# హైవేలో ఆగిన కారు!

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభించారు. నాగపూర్లో కార్యాలయం ప్రారంభానికే 400 కార్ల కాన్వాయ్తో తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వెళ్లారు. మహారాష్ట్ర నుంచి మంచి స్పందన వస్తుందని లోక్సభ ఎన్నికల్లో కనీసం 20 నుంచి 30 సీట్లు గెలుసా-మని లెక్కలు కూడా వేసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారని ప్రచారం కూడా చేశారు.అధికారంలో ఉన్నప్పుడు దూకుడు ప్రదర్శించిన కేసీఆర్.. ఇప్పుడు పూర్తిగా సైలెంట్ అయ్యారు. తెలంగాణనే ఇంత అభివృద్ధి చేశామని అక్కడ ఊదరగొట్టి.. ఇప్పుడు సొంత రాష్ట్రంలోనే పార్టీ ఓడిపోవడంతో తల ఎత్తుకోలేని పరిస్థితి. మహారాష్ట్ర వాసులకు ఏం చెప్పాలో అర్థం కాని సంకట స్థితిలో కేసీఆర్ ఉన్నారు. మరోవైపు చేరికలు ఆగిపోయాయి. తెలంగాణ వాసులకు తెరుచుకోని ప్రగతి భవన్ గేట్లు.. నాడు ఇతర రాష్ట్రాల వారికి తెరుచుకున్నాయి. ఇప్పుడు కేసీఆరే ప్రగతి భవన్ ఖాళీ చేశారు. దీంతో మహారాష్ట్ర నేతలు ఇటువైపు కూడా చూడడం లేదు. కేసీఆర్ కూడా ఎలాంటి ఆలోచనలు చేస్తున్నట్లుగా కనిపించడం లేదు.పరిస్థితి చూస్తుంటే త్వరలోనే లోక్సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఫిబ్రవరి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల అవుతుందని బీజేపీ నేతలే చెబుతున్నారు. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. తమది కూడా జాతీయ పార్టీ అని ప్రకటించిన కేసీఆర్.. మాత్రం మహా-రాష్ట్రలో పోటీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడున్న పరిస్థితి చూస్తుంటే కేసీఆర్ మహారాష్ట్రపై చేతులు ఎత్తేసినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ పోటీ చేసినా ఓడిపేతో.. పార్టీకి మరింత నష్టం జరుగుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## 'కారు'లో ఇం'ధనం' ఫుల్

మొదటిపేజీ తరువాయి..

విరాళాలు లభించాయి. వీటిలో రూ.529 కోట్లు ఎలెక్టోరల్ బాండ్ల ద్వారా లభించాయి. అంతకముందు ఏడాది ఆ పార్టీకి రూ.193 కోట్ల విరాళాలు రాగా... వాటిలో ఎలెక్టోరల్ బాండ్ల ద్వారా కేవలం రూ.153 కోట్లు మాత్రమే లభించాయి. వివిధ పార్టీల ఆడిట్ రిపోర్టులను కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసింది. ఈ రిపోర్ట్ ఆధారంగా చూస్తే బీఆర్ఎస్ పార్టీకి గత ఏడాదితో పోల్చితే భారీగా విరాళాలు పెరిగాయి. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా ఎవరెవరు ఎంతిచ్చారంటే బీఆర్ఎస్ కు ఆ పార్టీ నేతలు, వారి సన్నిహితులే ఎక్కువగా విరాళాలు ఇచ్చారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, హాన్స్ పవర్ అండ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ, రాజపుష్ప ప్రాపర్టీస్. వీరంతా తలో రూ.10 కోట్ల విరాళాలను బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చారు. వ్యక్తుల నుంచి వచ్చిన రూ.64 కోట్ల విరాళాలలో ఈ నలుగురి వాటానే రూ.40 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వద్ది రాజు రవిచంద్రకి గాయత్రి గ్రానైట్స్ లో వాటా, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆయనకు భూములు ఉన్నాయి. వద్ది రాజు, గంగుల ఒకే పార్టీకి చెందిన నేతలే కాకుండా బంధువులు కూడా. ఇక హన్సా పవర్ అండ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు చెందినది. ఇక రాజా పుష్ప ప్రాప ర్టీస్ అనే కంపెనీ ఆ పార్టీ ఎమ్మెల్సీ పి. వెంకట్రామరెడ్డి బంధువులకు చెందినది. దీంతో బీఆర్ఎస్ మొత్తం విరా ళాలలో ఈ నలుగురి వాటానే ఎక్కువగా ఉంది.మాజీ మంత్రి మల్లారెడ్డి రూ.2.75 కోట్లు, మల్లారెడ్డి సతీమణి పేరిట రూ.2.25 కోట్లు విరాళంగా ఇచ్చారు. రోషణి మినరల్స్ నుంచి రూ.5 కోట్లు, వేములవాడ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చెల్మెడ నరసిం హారావు బంధువులకు చెందిన చెల్మెడ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.2 కోట్లు, విమలా ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.2 కోట్లు ఇచ్చారు. ఎలెక్టోరల్ ట్రస్ట్ ఫండ్స్ కింద ప్రుడెంట్ ఎలెక్టోరల్ ట్రస్ట్ నుంచి దఫాల వారీగా రూ.75 కోట్లు, రూ.10 కోట్లు, రూ.5 కోట్లు చొప్పున మొత్తం రూ.90 కోట్లు విరాళంగా అందాయి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అద్దె బస్సుఓనర్లతో చర్చలు సఫలం



**రేపటి నుంచి ఎలాంటి సమ్మె ఉండదని, యధావిధిగా అద్దె బస్సులు**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** అద్దె బస్సుఓనర్లతో చర్చలుసఫలం అయ్యాయని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జ నార్ లిపారు. గురువారం బస్ భవన్‌లో అద్దె బస్సు ఓనర్లతో ముగిసిన సమావేశం అనంతరం ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్టీసీ అద్దె బస్సు ఓనర్లతో సమావేశంలో పలు అంశాలు చర్చించామని పేర్కొన్నారు. వారు కొన్ని సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లో అద్దె బస్సు ఓనర్ల సమస్యలు పరిష్కారించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు గాను సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీ వేస్తామని తెలిపారు.రేపటి నుంచి ఎలాంటి సమ్మె ఉండదని, యధావిధిగా అద్దె బస్సులు నడుస్తాయని స్పష్టం చేశారు. సంక్రాంతికి కూడా ఫ్రీబస్ సర్వీస్ ఉంటుందని అలాగే సంక్రాంతికి స్పెషల్ బస్సులను కూడా నడుపుతామని సజ్జనార్ పేర్కొన్నారు. కాగా, అంతకుముందు అద్దె బస్సు ఓనర్ల సంఘం నేతలు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

# పోలీస్.. మాలిష్!



**మొదటిపేజీ తరువాయి..**

ఇన్ని రోజులు పోలీసులు ప్రవర్తించారు. ఎలాంటి కేసులైనా తామే డీల్ చేస్తూ, సెటిల్‌మెంట్లతో అందినకాడికి వెనకేసుకున్నారు. సివిల్ కేసుల్లో రియల్టర్స్, ల్యాండ్ గ్రాబర్స్‌కు సపోర్ట్ చేస్తూ, బాధితులకు అన్యాయం చేసిన కేసులూ ఉన్నాయి. కొన్ని కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో అత్యుత్సాహం చూపించారు. హై లెవల్ కేసుల్లో కూడా ఎస్సై, సీఐ స్థాయి అధికారులు పైస్థాయి అధికారులకు చెప్పకుండా డీల్ చేశారు. అయితే, ఇకపై ఇవన్నీ చెల్లవంటున్నారు పోలీసు ఉన్నతాధికారులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల సమస్యలు, ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి ఏర్పాటు చేశారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణిలో పోలీసులపై కూడా భారీగా కంప్లెయింట్స్ వస్తున్నాయి. సివిల్ వివాదాల్లో బాధితులను బెదిరించడం, కోర్టు కేసుల్లో తలదూర్చడం, నోటీసులు ఇవ్వకుండా పిలింపించి ధమ్కీలు ఇవ్వడం, సెటిల్‌మెంట్ చేస్కోవాలని బెదిరించడం లాంటివి చేశారని పోలీసులపై ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజావాణిలో పోలీసులపై వచ్చిన కంప్లెయింట్స్ పై స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్ పోలీసులతో విచారణ చేయిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. విచారణలో పోలీసుల పాత్ర ఉందని తేలితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.ఎఫ్ఐఆర్ చేయకుండా ఓ వర్గం వారి నుంచి డబ్బులు తీసుకుని అవతల వర్గం వారిని సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఫోర్స్ చేస్తున్నారు కొందరు ఇన్స్‌పెక్టర్లు. ఇలాంటి ఫిర్యాదులు ప్రజావాణిలో నమోదు అవుతున్నట్లు సమాచారం. ఇలాంటి ఎక్కడ జరిగినా ఉన్నతాధికారులకు కంప్లెయింట్ చేయాలని సూచిస్తున్నారు పోలీసులు. ఇక పలు వివాదాస్పదమైన కేసుల్లో ఆయా కేసుల తీవ్రతను బట్టి ఏసీపీ, డీసీపీ, పోలీస్ కమిషనర్లకు సమాచారమివ్వాలని లా అండ్ ఆర్డర్ ఇన్స్‌పెక్టర్లకు ఆదేశాలిచ్చారు పోలీసు ఉన్నతాధికారులు.ఇప్పటివరకు ప్రజావాణిలో పోలీసులపై రాష్ట్రవ్యాప్తంగా 480 ఫిర్యాదులు వచ్చినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. వీరందరిపై ఇన్వెస్టిగేషన్ చేయిస్తామంటున్నారు. మరోవైపు ఇప్పటికే పలు వివాదాల్లో తలదూర్చిన ఇన్స్‌పెక్టర్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ బాస్‌లు. సైబరాబాద్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్సైని సస్పెండ్ చేయగా, ఇద్దరు ఇన్స్‌పెక్టర్లను హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. హైదరాబాద్ పరిధిలో పంజాగుట్ట సీఐని సస్పెండ్ చేశారు.మొత్తంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో మరో 18 మంది ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారులపై ఇన్వెస్టిగేషన్ జరుగుతోందని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.. ఆరోపణలు నిజమని తేలితే వారిపై చర్యలు ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్లు ఆయా కమిషనరేట్ల పరిధిలో ఇన్స్‌పెక్టర్లతో మీటింగ్స్ పెట్టి వార్నింగ్ ఇచ్చారు. అయినా తీరు మార్చుకోని పోలీసులపై చర్యలు తప్పవంటున్నారు ఉన్నతాధికారులు.





# కేసీఆర్‌తో జగన్ భేటీ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్ లోని నివాసంలో కేసీఆర్ ను పరామర్శించారు. తర్వాత దాదాపుగా 40 నిమిషాల పాటు ఇరువురు రాజకీయ అంశాలపై చర్చించుకున్నట్లుగా తెలుస్తోంది. పార్టీ నేతలు ఎవరూ లేకుండా వారిద్దరే పలు అంశాలపై మాట్లాడుకున్నారని తెలుస్తోంది. కేసీఆర్, జగన్ మధ్య మంచి రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఉద్యమం సమయంలో జగన్ సమైక్యాంధ్రకు మద్దతుగా నిలిచిన సమయంలో రెండు పార్టీల మధ్య వివాదం ఏర్పడింది. జగన్ పరకాల పర్యటనకు వెళ్లిన సమయంలో రైల్వే స్టేషన్ లో టీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ల దాడి చేశారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిస్థితి మారిపోయింది. ఏపీలో చంద్రబాబు నాయుడు సీఎం అయ్యారు.. తెలంగాణలోనూ ఆయన రాజకీయాలు చేస్తూండటంతో.. శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా కేసీఆర్, జగన్ రాజకీయ స్నేహితులు అయ్యారు.2018 ముందస్తు ఎన్నికల సమయంలో వైసీపీకి బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా సహకరించింది. డేటా చోరీ వంటి కేసులు పెట్టడంతో పాటు.. టీడీపీకి ఆర్థికపరమైన వనరులు తెలంగాణ నుంచి అందకుండా చేయడంలో కేసీఆర్ సర్కార్ కీలక పాతర్ పోషించిందని చెబుతారు. అదే సమయంలో వైసీపీకి ఆర్థిక సాయం కూడా అందించారని అంటారు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ ను ప్రగతి భవన్ లో కలిశారు. ఆ తర్వాత కూడా భేటీలు జరిగాయి. కానీ గత రెండు, మూడేళ్లుగా నేరుగా సమావేశం కాలేదు. రెండు రాష్ట్రాల మధ్య పలు సమస్యలు వచ్చినా నేరుగా జగన్ ఎప్పుడూ కల్పించుకోలేదు. రాజకీయ సంబంధాలు మాత్రం యధావిధిగా కొనసాగుతున్నాయి.ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన కీలక నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బీఆర్ఎస్ తరపున కీలక పాత్ర పోషించారు.సర్వేలు, అభ్యర్థులు, అభ్యర్థులకు ఆర్థిక సాయం విషయంలో ఆయన కీలకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతూ ఉంటాయి. అయినా ఎన్నికల్లో వ్యతిరేక ఫలితం వచ్చింది. తాజా భేటీలో చెవిరెడ్డి కూడా పాల్గొన్నారు.

కానీ కేసీఆర్, జగన్ ముఖాముఖి చర్చలు జరిపిన సమయంలో పక్కన చెవిరెడ్డి కూడా లేనట్లుగా తెలుస్తోంది. వచ్చే మార్చి లేదా ఏప్రిల్‌లో ఏపీ అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల వ్యూహాలపై కేసీఆర్ చర్చించినట్లుగా చెబుతున్నారు. మరో వైపు భేటీ ముగిసిన తర్వాత సీఎం జగన్ లోటస్ పాండ్‌కు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా ఎయిర్ పోర్టుకు వెళ్లాల్సి ఉంది. కానీ లోటస్ పాండ్ ఇంటికి వెళ్లారు. అక్కడ జగన్ తల్లి విజయమ్మ ఉండటంతో ఆమెతో చర్చలు జరిపేందుకు వెళ్లారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంలో జగన్ విజయమ్మతో భేటీకి హైదరాబాద్ రావడం ఆసక్తికరంగా మారింది.

# ఆరింటి ఖజానా వేరే!



**మొదటిపేజీ తరువాయి..**

కోరామని, అదికూడా ఏడాదికి సరిపడా బడ్జెట్ ప్రతిపాదనలు ఇవ్వాలని కోరామని వివరించారు. అందుకు తగినట్లుగా ఆయా శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధంచేసే పనిలో ఉన్నారని వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ ఎక్కౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందున? ఎలాగూ కేంద్ర ప్రాయోజిత పథకాలకు పెద్దగా నిధుల కేటాయింపులు కూడా ఉండకపోవచ్చునని, ఒకవేళ కేటాయింపులు చేసినా అవి గరిష్టంగా ఆరు నెలలకే పరిమితంగా ఉండవచ్చునని, అందుచేతనే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న సవాళ్ళను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను ఏడాదికి సరిపడా ప్రవేశపెడితేనే సత్ఫలితాలు ఉంటాయని కొందరు సీనియర్ అధికారులంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్తున్న ఆదాయాన్నే దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 2024-25వ ఆర్థిక సంవత్సరానికి అవసంమైన బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉంటుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ప్రస్తుతమున్న ఆదాయం సుమారు 2.60 లక్షల కోట్ల రూపాయలని, ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని మరో 0.5 శాతం పెంచుకోగలిగితే అదనంగా సుమారు 20 వేల కోట్ల రూపాయల నిధులు ఖజానాకు వస్తాయని, అదే జరిగితే ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయడానికి ఆర్థికపరమైన ఇబ్బందులేమీ ఉండవని, సాఫీగా గ్యారెంటీలన్నీ అమలు చేయవచ్చునని ఆ అధికారులు ధీమాగా చెబుతున్నారు. అందుచేతనే 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ మొత్తం (ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కలుపుకొని) సుమారు 2.85 లక్షల కోట్ల రూపాయల వరకూ ప్రవేశపెట్టగలిగితే సమస్యలన్నీ అధిగమించినట్లు అవుతుందని అంటున్నారు. ప్రభుత్వ ఖర్చుల్లో అత్యంత ప్రధానమైన ఉద్యోగుల జీతభత్యాలకు సుమారు 39 వేల కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని, పెన్షన్లకు 13025 కోట్లు, సబ్సిడీలకు ప్రస్తుత లెక్కల ప్రకారం 12,959 కోట్ల రూపాయలు, అప్పులకు వడ్డీలు- ఇతర చెల్లింపులకు ప్రస్తుతం 22,408 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామని, వీటన్నింటికీ కలిపిఒక లక్షా 25 వేల కోట్ల రూపాయల నిధులు సరిపోతాయని, రెవెన్యూ రాబడుల్లోనే ఇంకనూ ఒక లక్షా 35 వేల కోట్ల రూపాయలు మిగులుతాయని, వాటిని ఆరు గ్యారెంటీలకు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవచ్చునని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ విజయవంతంగా అమలు చేయవచ్చునని ఆ అధికారులు వివరించారు. అందుకు తగినట్లుగా 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రూపకల్పన చేసే దిశగా కసరత్తులు మొదలుపెట్టామని వివరించారు.ఈనెల 20వ తేదీనాటికల్లా కొత్త బడ్జెట్ రూపకల్పనపై మరింత స్పష్టత వస్తుందని, ఎవ్వరైనా? ఎన్ని విధాలుగా కసరత్తులు చేసినా పైన తెలిపిన వ్యూహంతోనే బడ్జెట్‌ను తయారు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. అదీగాక సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందో? కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీ ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో కూడా తెలియదని, అందుకే కేంద్రంపై పూర్తిస్థాయిలో ఆధారపడకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఇప్పుడు ఖజానాకు వస్తున్న నిధులను దృష్టిలో ఉంచుకొని, ఎఫ్ఆర్‌బిఎం పరిమితికి లోబడి రుణాలను సమీకరించుకొని, సొంత ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రత్యామ్నాయ ప్రయత్నాలను అన్వేషించి అదనంగా మరో 20 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని పెంచుకునే ఏర్పాట్లు చేసుకుంటే సరికోతుందని ఆ అధికారులు వివరించారు. ఈ వ్యూహంతోనే తాము కసరత్తులు ప్రారంభించామని అంటున్నారు.

# అబ్బ ఒక్కటి..!

**మొదటిపేజీ తరువాయి..**

సీటు ఇవ్వండి.. మళ్లీ ఇరగదీద్దాం అంటూ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇంతకీ ఎర్రసైన్యం ఏ సీటు అడుగుతోంది.? కాంగ్రెస్ పార్టీతో కలిసి అసెంబ్లీ మాదిరి పార్లమెంట్‌లోనూ ఓ పాదం మోపుతారా..? కలిసివచ్చిన కాలాన్ని అందిపుచ్చుకోవాలన్న చందంగా కామ్రేడ్లు కదం తొక్కుతున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేసిన సీపీఐ భారీ విజయం సాధించింది. దీంతో అదే ఊపులో, అదే పొత్తుతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని సీపీఐ నేతలు భావిస్తున్నారు. అన్ని పార్టీలు లోక్‌సభ ఎన్నికలపై సమాయత్తం అవుతున్న వేళ కామ్రేడ్లు కూడా పక్కా ప్లాన్ తో ముందుకు వెళున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ తెలంగాణలో అదే పంథా కొనసాగిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి వెళ్లినట్లు పార్లమెంట్ ఎన్నికల్లోనూ తెలంగాణలో పొత్తుతో పోటీ చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారట.ఇందులో భాగంగానే లోక్ సభ ఎలక్షన్స్‌లోనూ కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని అనుకుంటున్నామని గతంలోనే సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. అదే అంశాన్ని సిపీఐ నేతలంతా కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి చెప్పారట. శాసన సభలో సీపీఐ కాంగ్రెస్ పొత్తు సత్ఫలితాలు ఇచ్చినందున.. లోక్ సభ ఎన్నికల్లో అదే అవగాహనతో పోటీ చేసి పరస్పరం సహకరించుకుందామని సీపీఐ నేతల బృందం రేవంత్ రెడ్డిని కోరింది. కామ్రేడ్ల పట్టున్న ఖమ్మం, నల్గొండ స్థానాల్లో ఏదో ఒక్కటి ఇస్తే చాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీ అధిష్టానమే ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పినట్లు తెలుస్తోంది.ఇక సీపీఐ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో తమ ప్రాబల్యాన్ని చాటింది. దీంతో ఆయా జిల్లాలోనే లోక్ సభ స్థానాల్లో తమకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ అవగాహనతో గెలిచి తీరుతామని కామ్రేడ్లు చెబుతున్నారు. ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి గతంలో పోటీ చేసిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మరోసారి ఆ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం లోక్ సభ స్థానం సీపీఐకి కేటాయించి గెలిచేందుకు సహకరించాలని కాంగ్రెస్‌కు సీపీఐ నేతల బృందం విన్నవించింది. అది కుదరకపోతే నల్గొండ స్థానం అయిన ఇవ్వాలని



కోరినట్లు తెలుస్తోంది. 2014లో ఖమ్మం నుంచి పోటి చేసి ఓడిపోయిన నారాయణ.. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుతో ఈసారి గట్టెక్కొచ్చని భావిస్తున్నారు.రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాల అవగాహన కాంగ్రెస్ - సీపీఐ మధ్య కుదిరింది. ఇప్పుడు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడంతో పాటు లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేద్దామంటూ కాంగ్రెస్ ముందు కమ్యూనిస్టులు ప్రతిపాదన ఉంచారు. కాంగ్రెస్ అధిష్ఠానం మరి సీపీఐకి ఒక్క లోక్‌సభ స్థానం రాష్ట్రంలో కేటాయిస్తోందో లేదో వేచి చూడాలి..

# పో(టీ)టుగాళ్ల కోసం వేట

**మొదటిపేజీ తరువాయి..**

సిద్ధపడుతున్నారట. ఇటీవల నల్లగొండకు వచ్చిన జాతీయ నేత డాక్టర్ లక్ష్మణ్‌కు లేఖ కూడా ఇచ్చారట. ఈయన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉన్నప్పుడు సూర్యాపేటలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసి మంచి పేరు సంపాదించారు. గతంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరి తిరిగి బీజేపీలో చేరారు. పార్టీలు మారినప్పటికీ ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని వ్యక్తిగా గుర్తింపు ఉంది. పార్టీలో కూడా అందరితో మంచి సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఇక గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జితేంద్ర కుమార్ ఈసారి కూడా టికెట్ రేసులో ఉన్నారు.ఇదిలావుంటే, నల్గొండ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది నూకల నరసింహారెడ్డి, రాష్ట్ర రైతు మోర్చా అధ్యక్షుడిగా పనిచేసిన గోలి మధుసూదన్ రెడ్డి కూడా ఎంపీగా బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిద్దరూ విద్యార్థి దశ నుంచి పార్టీలో పనిచేస్తున్నారు. పార్టీ తోపాటు దాని అనుబంధ



సంఘాలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ లాంటి సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. అంతే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్న నాయకులతో వీరికి అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు.

గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నూకల నరసింహారెడ్డి భావించినప్పటికీ పార్టీ అవకాశం ఇవ్వలేదట. నల్లగొండ పార్లమెంటు బరి నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించాలని భావిస్తే, నూకల నరసింహారెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఎవరికి వారే తమకు టికెట్ వస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అయితే వీరు ఈసారి పార్టీ ఆదేశిస్తే పోటీకి సై అంటున్నారట.మరోవైపు నల్గొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ కూడా ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. కొంత కాలంగా పార్టీ పార్లమెంటు విభాగం ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్నారు. 2019 ఎన్నికల సందర్భంగా కూడా ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఈసారి ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారట. నల్గొండ పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థులు అరడజను మంది వరకు పోటీ పడుతున్నప్పటికీ.. ఎవరికి టికెట్ కేటాయిస్తుందో వేచి చూడాలి..!

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# వైఎస్సార్టీపీ 'హస్త'మయం!



**కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిల**

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసారు. బుధవారం సాయంత్రం షర్మిల విజయవాడ నుంచి నేరుగా ఢిల్లీ వెళ్లారు. భర్త అనిల్‌తో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే, రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్లో షర్మిల చేరారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. షర్మిల మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన ఆఖరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశారని ఆమె అన్నారు. ఆయన బిడ్డగా ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.. కాంగ్రెస్ పార్టీ కోసం వైఎస్సార్ తన జీవితకాలం కష్టపడ్డారని చెప్పారు. ఆయన చివరిక్షణం వరకూ పార్టీకి సేవ చేశారని గుర్తుచేశారు. ఈరోజు దేశంలోనే అతిపెద్ద సెక్యూలర్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానించారు.

# సంపాదకీయమ్..

## ఎన్నికల నామ సంవత్సరం..

2024 నూతన సంవత్సరాన్ని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ పొలిటికల్ వార్ ఇయర్ గానే భావిస్తున్నాయి. దేశ నేతలు, ప్రజలందరి దృష్టి రాబోయే లోక్ సభ సమరంపైనే ఉంది. 2023లో 5 రాష్ట్రాల ఎన్నికల తంతు ముగియగా.. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీ భారీ మెజార్టీ సాధించి ఆ రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకుంది. ఇక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయగా, మిగిలిన రాష్ట్రాల్లో ఫలితాలపై హస్తం పార్టీ దృష్టి సారించింది. ఈ పాఠాలతో రాబోయే లోక్ సభ ఎన్నికలపైనే ఫుల్ ఫోకస్ పెట్టింది. మరోవైపు, జమ్మూకశ్మీర్ లో సైతం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ ఏడాది చివరి వరకూ ఎన్నికల వేడి కొనసాగుతూనే ఉంటుందనేది కాదనలేని సత్యం. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం లోక్ సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు సైతం ఏప్రిల్ – మేలోనే ఒకేసారి నిర్వహించే అవకాశం ఉంది. అయితే, ఈ ఏడాది చివర్లో హర్యానా, మహారాష్ట్రల్లోనూ ఎన్నికలు జరగొచ్చు. ఇక జమ్మూకశ్మీర్ లో చివరిసారిగా పదేళ్ల క్రితం 2014లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. తాజాగా, ఆర్టికల్ 370 రద్దు విషయంలో కేంద్ర నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు సెప్టెంబర్ 30, 2024లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. మరి అక్కడ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం ఉంటుందో అనేది ఉత్కంఠగా మారింది. 2023లో జరిగిన ఎన్నికల్లో 3 రాష్ట్రాల విజయంతో ఫుల్ జోష్ లో ఉన్న బీజేపీ, 2024లోనూ అదే హవా కొనసాగిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఇండియా కూటమి ప్రభావం ఉంటుందని భావించిన తరుణంలో.. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో విజయం కమలంలో మరింత ఉత్సాహం నింపింది. ప్రధాని మోదీ మరోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీజేపీ నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. అత్యంత ప్రభావవంతమైన ప్రధానిగా మోదీ మళ్లీ విజయం సాధిస్తారని భావిస్తున్నారు. అయితే, బీజేపీని ఎదుర్కోవాలంటే కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య ఐక్యతపై ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో కమలం పార్టీ పూర్తి అధికారంలో ఉండగా, మరో 4 రాష్ట్రాల్లో అధికార పార్టీలో భాగంగా ఉంది. ఇక తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. బెంగాల్ లో టీఎంసి, జార్ఖండ్ లో జెఎంఎం, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్, తమిళనాడులో డీఎంకే అధికారంలో ఉంది. మారుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత ఆసక్తిగా మారాయి. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ మధ్య హోరాహోరీ వార్ సాగుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టుతో జరిగిన పరిణామాల మధ్య తాము టీడీపీతో కలిసి ఎన్నికల బరిలోకి వెళ్తామన్న జనసేనాని పవన్ కల్యాణ్ ప్రకటనతో ఒక్కసారిగా పొలిటికల్ ముఖచిత్రం మారింది. వైసీపీ విముక్త ఏపీనే లక్ష్యంగా ముందుకు సాగుతామని టీడీపీ – జనసేన కూటమి స్పష్టం చేసింది. బీజేడీ కంచుకోటగా ఉన్న ఒడిశాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ వరుసగా ఆరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో తాము చేసిన అభివృద్ధే.. బీజేపీ, కాంగ్రెస్ ల పోటీని తట్టుకుని మరోసారి విజయం సాధించేలా చేస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఐఏఎస్ వీకే పాండియన్ చేరికతో బీజేడీలో ఫుల్ జోష్ కనిపిస్తోంది. పూరీ జగన్నాథ్ ఆలయాభివృద్ధి, ఇతర ప్రార్థనా స్థలాల పునరుద్ధరణ, ఆధునిక పాఠశాలలు, కళాశాలల నిర్మాణం, ఒడిశా ప్రత్యేక కేటగిరీ హోదాపై తీర్మానానికి ఆమోదం వంటి వాటితో దూసుకెళ్తోంది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశాలో బీజేపీ విజయం సాధించేలా వ్యూహాలు రచిస్తున్నారు. బీజేడీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ సైతం పావులు కదుపుతోంది. బీజేడీ, బీజేపీ ఒకటే అని విధానాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, తెలంగాణ మాదిరిగానే ఒడిశా ఫలితం మారుతుందని ఆశాభావంతో ఉంది. కాగా, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 147 స్థానాల్లో బీజేడీ 112 స్థానాలు కైవసం చేసుకోగా, బీజేపీ 23 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ కేవలం 9 స్థానాల్లోనే విజయం సాధించింది. 2014 నుంచి, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ప్రాబల్యం పెరగడానికి అరుణాచల్ ప్రదేశ్ విజయం కీలకంగా మారింది. ఇక్కడ కమలం పార్టీకి కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి గట్టి పరీక్ష ఎదురుకానుంది. అరుణాచల్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్ కేసు, అవినీతి ఆరోపణలు.. అధికార బీజేపీని మరింత ఇరుకున పెట్టే అంశాలు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 60 స్థానాల్లో బీజేపీ 41, జేడీ(యూ) 7, కాంగ్రెస్ 4 స్థానాల్లో విజయం సాధించాయి. సిక్కింలో డెమోక్రాటిక్ ఫ్రంట్ కు చెందిన మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్, ప్రస్తుత సీఎం, క్రాంతికారి మోర్చా (ఎస్కేఎం) పార్టీ చీఫ్ ప్రేమ్ సింగ్ తమాంగ్ మధ్య గట్టి పోటీ నెలకొంది. 2019 ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యంలో అధికారం కోల్పోయిన చామ్లింగ్.. 2024 ఎన్నికల్లో గెలవాలనే కృతనిశ్చయంతో ఉన్నారు. అయితే, రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగ హామీతో ఇప్పటికే తమాంగ్ ఎన్నికలకు సిద్ధమయ్యారు. 32 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో గత ఎన్నికల్లో ఎస్కేఎం 17 సీట్లు గెలుచుకోగా, ఎస్డిఎఫ్ 15 సీట్లు గెలుచుకుంది. ఈసారి హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి గట్టి సవాల్ గానే మారాయి. 2019లో జెజెపితో కూటమి అనంతరం బీజేపీ అధికారాన్ని నిలుపుకొంది. అయితే, నుహ్ మత ఘర్షణలు, డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఈ రెండు భాగస్వామ్య పక్షాల మధ్య విభేదాలకు దారి తీశాయి. బ్రిజ్ భూషణ్ సహాయకున్ని అధ్యక్షునిగా ఎన్నుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం డబ్ల్యూఎఫ్ఐను సస్పెండ్ చేసిందనే ఊహాగానాలు వ్యాపించాయి. మరోవైపు, ఈ రెండు సంఘటనల ఆధారంగా కాంగ్రెస్, ఆప్ లు అధికార బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈసారి మనోహర్ లాల్ ఖట్టర్ విజయం కోసం చెమటోడ్చాల్సిన పరిస్థితి తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలిచి, 10 సీట్లు గెలిచిన దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ కు 31 సీట్లు వచ్చాయి. అన్ని పార్టీలకు మహారాష్ట్ర కీలకమైనది. 2019 ఎన్నికల సమయంలో బీజేపీ 106 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, సీఎం పదవిపై అప్పటి మిత్రపక్షమైన శివసేనతో విభేదాలు వచ్చాయి. కాంగ్రెస్, ఎన్సిపి మద్దతుతో సేన మహా వికాస్ అఘాడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, గత ఏడాది జూన్‌లో శివసేన ఎమ్మెల్యే ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు ప్రభుత్వం పతనానికి దారితీసింది. కొన్ని నెలల తర్వాత, శరద్ పవార్ మేనల్లుడు అజిత్ బీజేపీతో చేతులు కలపడం ద్వారా ఎన్సీపీలో చీలిక వచ్చింది. ప్రస్తుతం సీట్ షేరింగ్, మరాఠా రిజర్వేషన్లు వంటివి కాషాయ పార్టీని ఇరుకున పెట్టే అంశాలుగా మారాయి. రాష్ట్ర జనాభాలో 33 శాతం ఉన్న మరాఠాలు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ తో అధికార కూటమిని ఇరుకున పెట్టింది. ఈ డిమాండ్ పై ఓబీసీ గ్రూపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేందుకు కుల ఆధారిత జనాభా లెక్కలతో పాటు కోటాలో 50 శాతం పరిమితిని పెంచడం ద్వారా మరాఠాలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 10 ఏళ్ల విరామం తర్వాత, జమ్మూకాశ్మీర్ లో ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలన్న ఆదేశాలతో ఈసారి ఇక్కడ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మరి, ఇక్కడ ఎన్నికల నిర్వహణపైనా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



# రేపటితో ప్రజాపాలన ముగింపు

- **ఈనెల 17 వరకు అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తి**
- **దరఖాస్తుదారుల నమోదులో ఆధార్ నెంబర్, వైట్ రేషన్ కార్డులు ప్రామాణికం**
- **ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహించబడును**
- **దరఖాస్తు ఇవ్వని వారు, మరోసారి తిరిగి దరఖాస్తులు అందచేయవచ్చు**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ లను ఈనెల 17 వతేదీ వరకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన నిర్వహణ, దారఖాస్తుల డాటా ఎంట్రీ లపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయితీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలను ఏవిధమైన ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లా కలెక్టర్లను సి.ఎస్ అభినందించారు. ఈనెల 6 వ తేదీన ప్రజాపాలన ముగిసిన వెంటనే అందిన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మండల కేంద్రాల్లో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. మండల రెవిన్యూ అధికారులు, మండల డెవలప్ మెంట్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డాటా ఎంట్రీ చేపట్టాలని, ప్రజాపాలన కార్యక్రమం సూపర్వైజరీ అధికారిగా ఉన్న జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షించాలని తెలిపారు. ఈ డాటా ఎంట్రీ చేపట్టేందుకుగాను జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో ట్రెయినీ అఫ్ ట్రైనర్ (టూ ) లకు 4 వ తేదీన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ టూ లు జిల్లా స్థాయిలో డాటా ఎంట్రీ ఏవిధంగా చేయాలన్న దానిపై 5 వ తేదీన శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈనెల 5 వ తేదీ నుండి 17 వ తేదీ వరకు అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తి చేయాలని, ఈ డాటా ఎంట్రీ సందర్భంగా, దరఖాస్తు దారుల వివరాల నమోదులో ఆధార్ నెంబర్, వైట్ రేషన్ కార్డు లను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశా–రు. ఇందుకుగాను, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న డీ.టి.పి ఆపరేటర్ల సేవలను ఉపయోగించుకోవాలని, అవసరమైతే ప్రయివేటు ఆపరేటర్లను హైర్ చేసుకోవాలని సి.ఎస్ సూచించారు. నిన్నటి వరకు దాదాపు 57 లక్షల దారఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున, దరఖాస్తు ఇవ్వని వారు, మరోసారి తిరిగి దారఖాస్తులు అందచేయవచ్చని తెలియ చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, జీహెచ్ ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్, పంచాయితీ రాజ్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదేళ్లుగా అణచివేతలు, అక్రమకేసులు

- **ఒక ఫోన్ కాల్ చేసుకోలేని పరిస్థితిలో ఉద్యోగం చేసాం**
- **ఉప ముఖ్య మంత్రి బట్టి వికరమార్కకు తెలంగాణా ఉద్యోగ సంఘాల నేతల మొర**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ గెజిటెడ్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం,తెలంగాణా మునిసిపల్ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆద్వర్యం లో గురువారం సచివాలయం లో ఉప ముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్కను గెజిటెడ్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అద్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు,పరమేశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అద్యక్షులు ఎల్.తాజ్ మోహన్ రెడ్డి లు కలిసి కొత్త ప్రభుత్వానికి అభినందనలు మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ గెజిటెడ్ ఉద్యోగులు ,తెలంగాణా మునిసిపల్ ఉద్యోగులు తొమ్మిది సంవత్సరాలుగా ఎదురుకొంటున్న సమస్యలు, అణచి వేతళ్ళు, అక్రమకేసుల బనాయింపు, గత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అవలంబించిన వైఖరి మొదలగు అంశాలపై ఉప ముఖ్య మంత్రి కి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమం సమయంలోనే తమ అసోసియేషన్ కు చెందిన వివిధ గ్రేడ్లలోని గెజిటెడ్ ఉద్యోగులం ఉద్యమం లో పాల్గొన్న విశయాన్ని వారు వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో గత తొమ్మిదే ళ్లుగా తీవ్ర అణచివేతకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు అయ్యాక కూడా పలు క్రిమినల్ కేసులు పెట్టారని,గత ప్రభుత్వం హయాంలో ఒక ఫోన్ కాల్ చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జరిగిన అవకతవక లపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ



జరిపించాలని విజ్ఞప్తి చేసారు. అప్పటి వరకు ఆఫీస్ బే–రర్లుగా ఉన్న వారి ఆదేశాలు అమలుపరచొద్దని, నూతన ప్రభుత్వానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. ఇకనుంచి ఉద్యమం సమయంలో ఉద్యోగ సంఘాలు, జేఏసీలు ఎలా ఉండేవో అలాంటి వాటినే మళ్ళీ తయారు చేస్తామన్నారు.

# రెండు ఎమ్మెల్సీలకు నోటిఫికేషన్లు

మొదటిపేజీ తరువాయి..

పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా లేఖలు సమర్పించారు. దీంతో ఆ రెండు స్థానాలకు ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరం 11న నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 29న పోలింగ్ జరనుంది. అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్ర శా–సనమండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ కోసం కేంద్ర ఎలక్షన్ కమిషన్ షెడ్యూలు విడుదల చేసింది. ఇందుకోసం జనవరి 11న నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డిల రాజీనామాను శాసన మండలి చైర్మన్ ఆమోదించడంతో ఆ రెండు స్థానాలూ ఖాళీగా ఉన్నాయి. వీరిద్దరూ ఎమ్మెల్యే కోటా కిందనే ఎన్నికయ్యారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జనవరి 29న పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు. వాస్తవానికి వారిద్దరి పదవీకాలం 2027 నవంబరు 30 వరకూ ఉంది. కానీ రాజీనామా చేయడంతో ఇప్పుడు ఉప ఎన్నిక అనివార్యమైంది. కొత్తగా ఎమ్మెల్సీలు ఎన్నికైనా అప్పటి వరకే కొనసాగనున్నారు. నోటిఫికేషన్ వెలువడడంతోనే నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. జనవరి 18వ తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేసుకునే అవకాశముంది. జనవరి 22న నామినేషన్లను ఉపసంహరించుకోడానికి తుది గడువు.




జనవరి 29న పోలింగ్ నిర్వహిస్తారు.
నోటిఫికేషన్ విడుదలః జనవరి 11, 2024
నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంః జనవరి 11, 2024
నామినేషన్ల దాఖలుకు తుది గడువుః జనవరి 18, 2024
స్క్రూటినీ ప్రక్రియః జనవరి 19, 2024
నామినేషన్ల ఉపసంహరణకు గడువుః జనవరి 22, 2024
పోలింగ్ తేదీ : జనవరి 29, 2024
పోలింగ్ సమయం : ఉ. 9.00 గం. నుంచి సా. 4.00 గం. వరకు
ఫలితాలుః జనవరి 29, 2024 పోలింగ్ అనంతరం.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215